క్లుప్తంగా

రైల్వే బ్రిడ్జి వద్ద నీరు నిల్వకుండా చూడాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తాంసి: మండలంలోని పొన్నారి శివారులోని రైల్వే గేటు 29 రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలువ మొత్తం పూడుకుపోయి వర్షపు నీరు నిల్వ ఉంటుందన్నారు. పంటచేలకు రాకపోకలు చేయడానికి అవస్థలు పడుతున్నామన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. రైల్వే మేనేజర్ స్పందించి వెంటనే ఉన్నతాధికారులకు వివరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారి వెంట వైస్ ఎంపీపీ రఘు, గ్రామపెద్దలు అశోక్, రమణ, ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

‘ఉదాసీనతగా వ్యవహరించొద్దు’



మాట్లాడుతున్న మల్యాల మనోజ్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని రైస్ మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యంపై జిల్లా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ మాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో శుక్రవారం మాట్లాడారు. మిల్లుల యజమానులు వడ్లను మిల్లింగ్ చేసి వచ్చే బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉండగా, గడువు ముగిసిన ఇంకా రూ.44 కోట్లకు పైగా ధాన్యం వ్యాపారుల వద్ద ఉందన్నారు. దీనిని పౌరసరఫరాల సంస్థ అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటివరకు జిల్లా పౌరసరఫరాల అధికారులు తనిఖీలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి నష్టం చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మాదిగ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి ప్రసన్నకుమార్, ముక్కెర అశోక్, గజ్జల విలాస్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందేలా చూడాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందేలా చూడాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల డీడబ్ల్యూవోలు, సీడీపీవోలతో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు నిరంతరంగా పనిచేస్తూ.. చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందేలా చూడాలని, సీడీపీవోలు ఎప్పటికప్పుడు సందర్శించాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, సీడీపీవోలు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

ఖానాపూర్: పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండలంలోని సత్తన్‌పల్లిలో పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతుండగా ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం గ్రామంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దయానంద్, చిన్నం సత్యం, వెంకాగౌడ్, నిమ్మల రమేశ్, పుప్పాల శంకర్, అంకం రాజేందర్, తోట సత్యం, మాలవత్ రమేశ్‌నాయక్, గుమ్ముల రమేశ్, విజయ్, జక్కుల నర్సయ్య, బీర్నంది రాజన్న, బేర మల్లేశ్ తదితరులు ఉన్నారు.

సన్మానం

ఖానాపూర్: పట్టణంలోని అర్బాత్ కాలనీ మసీద్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన షేక్ షాహిద్‌ను శుక్రవారం మదీనా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చాంద్‌పాషా, షబ్బీర్‌పాషా, సయ్యద్ వహీం, ఇమామ్, ముక్తి అత్తార్, సలీంఖాన్, షౌకత్‌పాషా, సయ్యద్ అయూబ్, మీర్జాబేగ్, కమర్ పాల్గొన్నారు.

మళ్లీ ‘అమ్మహస్తం’?

- బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు
- గతంలో కాంగ్రెస్ హయాంలో తొమ్మిది రకాల సరుకులు
- మళ్లీ అదే తరహాలో ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం

జిల్లాలోని రేషన్‌కార్డులు 1,91,776
లబ్ధిదారులు 6,39,275



లబ్ధిదారుడి వేలిముద్రలు తీసుకుంటున్న రేషన్‌డీలర్ (ఫైల్)

బోథ్: రేషన్ దుకాణాల్లో బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పౌర సరఫరాలు, మార్కెటింగ్ శాఖల కార్యదర్శులు, పలువురు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి సమీక్ష నిర్వహించారు. ఈసమీక్షలో కొత్తగా రేషన్ కార్డుల జారీతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలైన ×అమ్మహస్తం₹ తరహాలో బియ్యంతో పాటు తొమ్మిది రకాల నిత్యావసర సరుకుల పంపిణీకి సంబంధించి నివేదికలు అందించాలని ఆదేశించినట్లు సమాచారం. ప్రస్తుతం పేదలకు చౌక ధర దుకాణాల ద్వారా బియ్యం మాత్రమే అందుతోంది. గతంలో కిలో బియ్యం రూ.1 ఉండగా, కరోనా వచ్చిన నాటి నుంచి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో బియ్యం తప్ప నిత్యావసర సరుకులు ఇవ్వడం లేదు. పప్పు, నూనె, చింత పండు, కారంపొడి, పసుపు, ఉల్లిగడ్డ, పంచదార సరుకులను ప్రజలు దుకాణాల్లో ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో కొనడం పేదలకు భారంగా మారింది. దీంతో ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు నిత్యావర సరుకులను అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు తక్కువ ధరకు అందిస్తే జిల్లాలోని 6,39,275 మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు మేలు జరగనుంది.

సరుకులు అందించాలి



గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది రకాల సరుకులు అందించింది. దీంతో చాలా మంది పేద ప్రజలకు తక్కువ ధరలకు సరుకులు పొందారు. ప్రస్తుతం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. సర్కారు స్పందించి తొమ్మిది రకాల సరుకులు అందించాలి. బహిరంగా మార్కెట్లో ధరలు విపరీతంగా పెరిగాయి.

– షేక్ నవాబ్, బోథ్

సబ్సిడీపై పంపిణీ చేయాలి



గతంలో మాదిరిగానే ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులను అందించాలి. మార్కెట్‌లో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కాబట్టి ప్రభుత్వం నిత్యావసర సరుకులను సబ్సిడీపై పంపిణీ చేయాలి. గతలో తొమ్మిది రకాల సరుకులు అందించారు. ఈ ప్రభుత్వంలో కూడా సరుకులను అందించాలి.

– తూము సంతోష్, బోథ్

తెలంగాణ వచ్చాక అమ్మహస్తం రద్దు..

తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి 2012లో ఉగాది పండుగను పురస్కరించుకొని అమ్మహస్తం పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద చౌకధర దుకాణాల ద్వారా బియ్యంతో పాటు తక్కువ ధరకు కిలో ఉల్లిగడ్డ, కిలో వంటనూనె, కిలో చింత పండు, కిలో ఉప్పు, కిలో కందిపప్పు, కిలో కారం పొడి, కిలో పంచ దార, పసుపు ప్యాకెట్ పంపిణీ చేసేవారు. ఆ సరుకులు పేద కుటుంబాలకు నెల రోజులకు సరిపోయేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం అమ్మహస్తం పథకాన్ని రద్దు చేసి బియ్యం పంపిణీ మాత్రమే కొనసాగించింది. అప్పటి నుంచి నిత్యావసర సరుకులు బయట మార్కెట్లో కొనుగోలు చేయటం భారంగా మారింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అమ్మహస్తం సరుకులు పంపిణీ చేయనుంది.

పంటచేలలో ఏడారి ఓడలు



తాంసి మండలంలోని వడ్డాడి శివారులో ఏడారి ఓడలు సంచారిస్తున్నాయి. పశుగ్రాసం కోసం ప్రతీ ఏటా రాజస్థాన్‌కు చెందిన పశువుల కాపరులు తమ పశువులతో పాటు ఓంటెలను తీసుకొని వలస వస్తారు. మత్తడివాగు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ఉంటూ.. అక్కడి పంటచేలలో మేపుతుంటారు. – తాంసి

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- వాడీవేడిగా సాగిన సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాజు

తాంసి: మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని జెడ్పీటీసీ రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీపీ మంజుల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు సకాలంలో సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకపోతే సమస్యలపై ఎలా చర్చించేదని అసహనం వ్యక్తం చేశారు. మొదటగా వ్యవసాయశాఖ ఏవో రవీందర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించకుండా దుకాణాల్లో తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరా క్రమం తప్పకుండా చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంత్ అన్నారు. విద్యుత్‌శాఖ అధికారి నజీర్ మాట్లాడుతుండగా.. కప్పర్ల, జామిడి ఎంపీటీసీలు ప్రశ్నించారు. కప్పర్ల గ్రామంలో థర్డ్ వైర్ లేక వీధిదీపాలు వెలగని పరిస్థితి నెలకొందన్నారు. ఐకేపీ ఏపీఎం మాట్లాడుతుండగా.. మండల సమాఖ్యకు చెందిన ట్రాక్టర్ పక్క మండలానికి ఎందుకు లీజ్‌కు ఇచ్చారని ఏపీఎంని ప్రశ్నించారు. పశువైద్య, విద్యశాఖ, అటవీశాఖ, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో మోహన్, వైస్ ఎంపీపీ రేఖ, సూపరింటెండెంట్ రవీందర్, ఏపీవో స్వప్నశీల పాల్గొన్నారు.

పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి

నేరడిగొండ: పంటల సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు సన్నాహక సమావేశాలు నిర్వహించారు. గాజిలి, బుగ్గారం, బంధంరేగడి, కొరిటికల్(బి), వాగ్దరి, వడూర్, యాపల్‌గూడ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. భూమిని చదును చేయడం నుంచి పంటల కోత వరకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గుర్తింపు ఉన్న విత్తన దుకాణదారుల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తన రశీదు పంటకాలం పూర్తి అయ్యేవరకు భద్రపర్చుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలి కోరారు. సమావేశాల్లో ఏఈవో జైపాల్, స్వర్ణలత, అపర్ణ, మహేందర్, సౌజన్య, గజేందర్, సంకీర్తన, రైతులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: రైతులు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విత్తుకోవాలని ఏఈవో అనుదీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుబ్బ గ్రామంలోని రైతులకు అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారి మాటలు నమ్మవద్దన్నారు. లైసెన్స్ పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోళ్లు చేయాలని కోరారు. కొనుగోళ్లు చేసిన ప్రతీ విత్తనానికి రశీదు తీసుకోవాలని కోరారు.

తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి

తాంసి: రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని తాంసి ఇన్‌చార్జి ఏడీఏ రవీందర్ రైతులకు సూచించారు. శుక్రవారం బండల్ నాగాపూర్ రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. పూర్తిగా వర్షాలు కురిసిన వెంటనే పత్తి విత్తనాలు వేయాలన్నారు. అనంతరం గ్రామంలో విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. వారి వెంట ఏఈవో వెంకట్, రైతులు ఉన్నారు.



ఇచ్చోడ: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని విత్తన దుకాణాల్లో మండల అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. పత్తి విత్తనాల లాట్ నంబర్లు, కంపెనీ, ప్యాకింగ్ తేదీ, స్టాక్ వివరాలపై ఆరా తీశారు. అనంతరం మండలంలోని ఏఈవోలు, విత్తన షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు లైసెన్స్ గల పత్తి విత్తనాల డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి అష్రఫ్, ఏఎస్సై సునీత, తదితరులు ఉన్నారు.

రైతులను మోసం చేస్తే లైసెన్స్ రద్దు చేస్తాం

నార్నూర్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించి మోసం చేస్తే లైసెన్స్ రద్దుచేసి, కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి జాడి దివ్య అన్నారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను తప్పనిసరిగా మెయింటెన్ చేయాలన్నారు. విత్తనాలకు, ఎరువులకు రశీదు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



తాంసి: అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రవీందర్



నేరడిగొండ: సూచనలు చేస్తున్న అధికారులు



ఆదిలాబాద్‌రూరల్: పరిశీలిస్తున్న అధికారులు

‘ఉపాధి’ పనుల్లో ప్రామాణికత పాటించాలి

ఇచ్చోడ: ఉపాధి పనుల్లో ప్రామాణికతను పాటించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గేర్జంలో ఉపాధి పనులు పరిశీలించారు. సిబ్బంది, కూలీలతో మాట్లాడారు. ప్రతీ రోజు కొలతలు సరిగ్గా చూసుకొని జాబ్‌కార్డులో నమోదు చేసే బాధ్యత సిబ్బందిదేనన్నారు.

పని చేసే వారికే డబ్బులు

నేరడిగొండ: ఉపాధిహామీ పథకంలో పనులు చేసే కూలీలకే డబ్బులు ఇవ్వాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాజుర గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా పనులు చేయకుండా డబ్బులు తీసుకుంటే తమకు సమాచారం అందించాలని కూలీలకు సూచించారు. ఆయన వెంట ఏపీవో వసంత్‌రావు, ఎఫ్ఏలు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు రూ. 18 వేల వేతనం అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. 2021 నుంచి 24 వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. పదేళ్లపాటు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సైతం అవినీతి గురించే ఆలోచిస్తుంది తప్పితే, అభివృద్ధి గురించి ఆలోచించడం లేదన్నారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సీసీఐ క్వార్టర్స్‌లోని సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. సీసీఐ పరిశ్రమ క్వార్టర్స్‌లో కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరా విషయంలో జీఎం ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, సీసీఐ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నిరంజన్ రావు, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎస్. విలాస్

‘పోలీసుల దాడిని ఖండిస్తున్నాం’

ఆదిలాబాద్‌టౌన్: పీడీఎస్‌యూ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌పై తాండూరు పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ సత్తార్ భౌతికదాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కాశీనాథ్ ఉండగానే విద్యార్థి నాయకుడిపై భౌతిక దాడి చేయడం సరికాదన్నారు. ఇలాంటి చర్యలతో పోలీసులపై సామాన్య ప్రజలకు నమ్మకం పోతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కామ్రేడ్ గిరిప్రసాద్ ఆశయ సాధనకు కృషి

ఎదులాపురం: కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేసిన కామ్రేడ్ గిరిప్రసాద్ ఆశయ సాధనకు సీపీఐ కృషి చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం కామ్రేడ్ నల్లమల గిరి ప్రసాద్ 27వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గిరి ప్రసాద్ విద్యార్థి దశలోనే ఉద్యమ బాట పట్టారన్నారు. 1961లో ఖమ్మం శాసనసభ్యుడిగా ఆయన వ్యవహరించారని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో అరుణ్ కుమార్, బెజ్జంకి నర్సింగ్‌రావు, అరిగెల గజారం, అద్దంకి రమేశ్, ఖండాల గణేష్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తగూడ గ్రామంలో పెర్సపేన్‌లకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలు ప్రకృతిని దైవంగా భావించి ఎంతో నియమ నిష్ఠాలతో పూజలు చేసి తమ సంస్కృతి, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను యావత్ ప్రపంచానికి చాటి చెప్పడం జరుగుతుందన్నారు. ముత్తాల కాలం నుంచి ఆచరిస్తున్న సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

అనుమతి లేని గుడిసెలకు నోటీసులు

బేల: మండల కేంద్రంలోని కుమురం భీం కాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన రెండు అక్రమ గుడిసెలకు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి గట్లెవార్ గజానన్ నోటీసులు అందజేశారు. కుమురం భీం తాలుకు భూవివాదంపై హైకోర్టులో కేసు ఉందని, వెంటనే ఈ నిర్మాణాలు నిలిపివేయాలని నిర్మాణదారులకు ఆదేశించారు. గిరిజనేతరులు ఇక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపటవద్దని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట కారోబారి కళ్యాణ్‌కార్ గజానన్, తదితరులు ఉన్నారు.



నోటీసు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి